క్లుప్తంగా

ఏలూరు జూట్ కార్మికులకు అండగా ఉంటాం

ఏలూరు (టూటౌన్): ఏలూరు జూట్ మిల్లు కార్మికులకు రాష్ట్ర పౌర హక్కుల సంఘం అండగా ఉంటుందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్వీ రత్నం తెలియజేసారు. జూట్‌మిల్లు యాజమాన్యం కార్మికుల శ్రమను దోచుకుని నేడు రోడ్డున పడేసి తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. మిల్లు నడపలేక పోతే చట్టబద్ధమైన జీతాలు, బెనిఫిట్స్, నష్టపరిహారం కార్మికులకు తక్షణమే చెల్లించాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం మిల్లు మూసివేయడం స్టాండింగ్ ఆర్డర్స్‌కి విరుద్ధమని అన్నారు. ప్రభుత్వం కార్మికుల జీవనోపాధికి రక్షణ కల్పించాలన్నారు. భవిష్యత్తులో కార్మికులు చేసే పోరాటానికి పౌరహక్కుల సంఘం మద్దతుని, సంఘీభావాన్ని తెలియజేస్తుందని శ్రీమన్నారాయణ, కేవీ రత్నం తెలిపారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి



దెందులూరులో గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మి

దెందులూరు: అన్ని గ్రామాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని, ప్రభుత్వ కార్యక్రమాలు అమలులో జగనన్న ఇళ్ల నిర్మాణం అత్యంత ప్రాధాన్యతగా గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ ఉద్యోగులు తీసుకోవాలని దెందులూరు ఎంపీడీవో ఏబీపీవీ లక్ష్మి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో అన్ని గ్రామాల గ్రామ కార్యదర్శులతో జగనన్న ఇళ్ల నిర్మాణం ప్రగతిపై గ్రామాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్మాణాల విషయంలో అలసత్వం వహిస్తే, అధికారులు, సంబంధిత కార్యదర్శులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాద్ వైద్యానికి ఆర్థిక సాయం

దెందులూరు: అనారోగ్యంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్‌ను శనివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పరామర్శించారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యం నిమిత్తం రూ. 50వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు డేరా ఆనంద్, పెదవేగి మండల వైసీపీ నాయకులు బొద్దు సతీష్ ఉన్నారు.

ఏలూరు నగరాభివృద్ధికి ప్రణాళికలు

- పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ
- రూ.3కోట్లతో పలు అభివృద్ధి పనులు
- ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ



సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని సుందరీకరణ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తామని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణకు లైఫ్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఏలూరులోని ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు బాధ్యత తీసుకోవాలని కోరారు. ఇక లైఫ్ కార్యక్రమంలో భాగంగా చెత్తను తగ్గించేందుకు రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్ (ఆర్ఆర్ఆర్) విధానాన్ని అమలు చేస్తామన్నారు. ఏలూరు నగరంలోని ప్రతి సచివాలయం పరిధిలో త్రిబుల్ ఆర్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నగరంలోని మేజర్, మైనర్ మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపడతామని కమిషనర్ తెలిపారు. వర్షం నీరు, మురుగునీరు డ్రెయినేజీల్లో సులువుగా పారేలా పూడుకలు తీత పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రజల దాహార్తిని తీర్చేలా శాశ్వత ప్రాతిపదికన చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు చల్లటి తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా పలు చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని కమిషనర్ వెంకటకృష్ణ వివరించారు. ఏలూరు నగరంలో 18 పార్కులను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు అయ్యాయని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. ఏలూరు నగర అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

చదువు ఆవశ్యకతను తల్లిదండ్రులు గుర్తించాలి

ఏలూరు (టూటౌన్): విద్య చైతన్య యాత్ర, పాఠశాలలో బాలబాలికల చేరికపై దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్సీ) ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ కాలనీలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాలల్లో చేరవల్సిన ఆవశ్యకతపై నినాదాలు చేసారు. చదువు ఆవశ్యకతను తల్లిదండ్రులు గుర్తించి తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా డీబీఆర్సీ సిటీ కో-ఆర్డినేటర్ బలే సురేష్ మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను తెలియజేస్తూ పిల్లలకు చదువుపై ఆసక్తి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. డ్రాపఅవుట్ పిల్లలు, 5 ఏళ్లు నిండిన పిల్లలందరూ పాఠశాలల్లో చేరాలని పిలుపునిచ్చారు. ఏలూరు నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. చదువు ఆవశ్యకతపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎల్సీ టీచర్ యామిని పిల్లలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



స్థానిక వైఎస్సార్ కాలనీలో పాఠశాల విద్యపై అవగాహన ర్యాలీ

ఉపాధి హామీలో అక్రమాలపై విచారణ చేయాలి

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి, అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.రామకృష్ణ కోరారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, అవినీతి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయించాలని కోరుతూ డ్వామా పీడీ ఏ.రాముకు శనివారం వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో సైట్ సూపర్ వైజర్లను నియమించాలని కోరారు. పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పిచాలన్నారు. చనిపోయిన కూలీల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. వేతనం రూ.272 వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ పాల్గొన్నారు.



డ్వామా పీడీ ఏ.రాముకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నేతలు

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

దెందులూరు: కొవ్వలిలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ శనివారం ఒక కూలీ గుండెపోటుతో మృతి చెందాడని దెందులూరు ఏపీవో దశరధరామ్‌జీ అన్నారు. కొవ్వలిలో తుమ్మల వెంకటేశ్వరరావు (62) మొండికోడు కాలువ డ్రెయిన్ పనులు చేస్తున్నాడు. ఈ సమయంలో గుండె నొప్పి వచ్చింది. ఆసుపత్రికి తరలిస్తుండగా, మృతి చెందాడని ఏపీవో తెలిపారు. ఎంపీడీవో ఏబీపీవీ లక్ష్మి, ఏపీవో దశరధరామ్‌జీ మృతిచెందిన వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నార్త్ సెక్షన్ పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలోని 33కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు ఆదివారం నిర్వహించేందుకు నిర్ణయించామని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ. శశిధర్ తెలిపారు. ఈ మేరకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పనులు కొనసాగుతాయన్నారు. స్థానిక అశోక్ నగర్, సబ్ స్టేషన్ పరిధిలోని ఆమచంద్రరావు పేట, విజయవిహార్ సెంటర్, రమా మహల్ సెంటర్, పోలీస్ క్వార్టర్స్, కలెక్టరేట్ కాంపౌండ్, కలెక్టరేట్ వెనకాల రోడ్డు, ఏటిగట్టు, కొత్త బస్టాండు ప్రాంతం, అశోక్ నగర్, పత్తేబాద, ఫైర్ స్టేషన్ సెంటర్ ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు

ఏలూరు రూరల్: ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి ప్రత్యేక లైన్లు వేసినప్పటికీ విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయని, లో ఓల్టేజీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కోమటిలంక సర్పంచ్ తెనాలి యోహాన్, వైసీపీ నాయకుడు ఎం రత్నం ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజుకు ఫిర్యాదు చేసారు. కొద్ది రోజులుగా కోమటిలంక, పెదయాగనమిల్లి రాత్రి వేళ లో-ఓల్టేజి ఏర్పడుతోందన్నారు. నిద్రలేక పిల్లలు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు. టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్లు తిరగడం లేదన్నారు. జాలిపూడి పంచాయతీ బాబూఖాన్ గూడెం రోడ్డు గూండా వెళ్లే విద్యుత్ తీగలు తెగిపోయేలా ప్రమాదకరంగా ఉన్నాయని స్థానిక వార్డు సభ్యుడు భయాందోళన వ్యక్తం చేసారు. వెంటనే ఎంపీపీ శ్రీనివాసరాజు ట్రాన్స్‌కో ఏఈ ఫోన్ చేసి సమస్య వివరించారు. దీనిపై స్పందించిన ఏఈ శ్రీనివాస్ విద్యుత్ వినియోగం పెరిగినందున లో-ఓల్టేజి సమస్య ఏర్పడుతోందన్నారు. దీన్ని నివారించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు.



ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజుకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని సత్యసాయి తాగునీటి పథకం సరఫరా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, గ్రామాలకు తాగునీటిని అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి శనివారం కోరారు. ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలపై చేస్తున్న ఆందోళనకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. దాదాపు 16 ఏళ్లుగా ఈ పథకం ద్వారా ఎటువంటి లోటుపాట్లు లేకుండా మంచినీటి సరఫరా చేశారని అన్నారు. సత్యసాయి సేవా సంస్థలు గోదావరి తాగునీటి పథకాన్ని నిర్మించి ప్రభుత్వానికి అప్పగించారని, ప్రభుత్వం అప్పట్లో నిర్వహణ బాధ్యతలు ఎల్అండ్‌టీ కంపెనీకి అప్పగించిందని అన్నారు. 150 మంది ఉద్యోగులకు 75 రోజులు వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్ట్ నుంచి ఎల్అండ్‌టీ తప్పుకుందన్నారు. అనంతరం నాలుగు నెలలకు కొత్త కాంట్రాక్టర్‌ను ప్రభుత్వం నియమించినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేమని, వేరే పనులు చూసుకోని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ పథకం ద్వారా పోలవరం, బుట్టాయగూడెం, గోపాలపురం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో సుమారు వందకు పైగా గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందన్నారు. బకాయి జీతాలు చెల్లించి ఉద్యోగులకు పని భద్రత కల్పించాలని రవి కోరారు.

జాలిపూడిలో పంచాయతీ పాలన వ్యవహారంపై విచారణ

ఏలూరు రూరల్: జాలిపూడి పంచాయతీ నిధులు ఖర్చుపై స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై విచారణ పూర్తి చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి చెప్పారు. శనివారం ఆమె జాలిపూడిలో పంచాయతీ పాలన వ్యవహారంపై విచారణ చేపట్టారు. ఉదయం 11 గంటలకు గ్రామానికి చేరుకుని పంచాయతీ నిధులతో చేపట్టిన డ్రెయినేజీ, తాగునీటి పైప్‌లైన్, శ్మశానం తదితర పనులు పరిశీలించారు. సర్పంచ్ వీధి నవ్య, కార్యదర్శి కుమార్, ఫిర్యాదుదారుడు కోడిచుక్కల నాగశేషు ఆమె వెంట ఉన్నారు. గ్రామంలో చేపట్టిన పనులు పూర్తి కాకుండానే బిల్లులు మంజూరు చేయాలని నాగశేషు డిమాండ్ చేస్తున్నాడని సర్పంచ్ ఎంపీడీఓకు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ఎం బుక్స్ సృష్టించి, పంచాయతీ నిధులను సర్పంచ్ తన బ్యాంక్ ఖాతాలో జమ చేసుకున్నారంటూ నాగశేషు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీఓ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. సర్పంచ్, ఫిర్యాదుదారుడు నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. కార్యదర్శి నుంచి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. రికార్డులు పరిశీలించి కొద్దిరోజుల్లో నివేదిక రూపొందిస్తానని ఆమె చెప్పారు.



జాలిపూడిలో పంచాయతీ చేపట్టిన పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ సరళకుమారి

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని పార్కులను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నామని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. నగరంలోని జన్మభూమి పార్కును ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే లక్ష్యంతో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. జన్మభూమి పార్కులో ప్లాంటేషన్‌తోపాటు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. పార్కులు పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఏర్పాటు చేయటంతోపాటు, సుందరీకరణ చేస్తామన్నారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ పలు సచివాలయాలను సందర్శించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును ఆరా తీశారు. ప్రజలకు సచివాలయాల్లో ఏ విధమైన సేవలు అందుతున్నాయనే విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్‌కుమార్, కార్పొరేటర్ పోతర్లంక లక్ష్మణ్, ఎస్ఈ వెంకటేశ్వరరావు, డీఈలు సత్యనారాయణ, తాతబాబు, విద్యుత్ ఏఈ శేషగిరి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



ఏలూరు జన్మభూమి పార్కును పరిశీలిస్తున్న నగర కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

భీమడోలు: భీమడోలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సభ్యుడు, దాత సలాది వీరబాబు తన కుమార్తె సలాది రేవతి జ్ఞాపకార్థం శనివారం భీమడోలులోని ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసారు. భీమడోలు బస్టాండ్‌లోని ప్రయాణికులకు, రోడ్డుపై వాహనదారులకు ఆయన మజ్జిగ పంపిణీ చేసారు. భీమడోలు బైపాస్ రోడ్డులో సంతమార్కెట్ శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో వందలాది మందికి మజ్జిగను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాల్లో సత్యసాయి సేవా సమితి భీమడోలు జోన్ అధ్యక్షుడు వర్ధినేడి సత్యసాయి, జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు, గ్రామాల కన్వీనర్లు దూడి రాజేష్, అల్లాడ ప్రసాదరావు, నాగమణి, ఆటో డ్రైవర్లు బత్తుల రంగారావు, సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకార మహోత్సవానికి తరలిరండి

పెదపాడు: లక్ష్మీపురంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్ అన్నారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం నుంచి ఉదయం 7 గంటలకు ర్యాలీగా బయలు దేరి పెదవేగి మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి ర్యాలీగా వెళతామని అన్నారు. అనంతరం ఉదయం 11.25 నిమిషాల సమయంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధ్యక్షతన నిర్వహించే ప్రమాణ స్వీకార మహోత్సవానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని కోరారు.

నేడు లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ

నిడమర్రు: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా బావాయిపాలెం గ్రామానికి చెందిన 38 మంది లబ్ధిదారులకు ఆదివారం ఉదయం 8 గంటలకు బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టాలు పంపిణీ చేయనున్నట్టు మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారన్నారు. బావాయిపాలెంకు చెందిన వైసీపీ శ్రేణులు హాజరవ్వాలని సత్యకుమార్ కోరారు.

చురుగ్గా అండర్‌పాస్ నిర్మాణం

దెందులూరు: దెందులూరు - అలుగులగూడెం రైల్వే క్రాసింగ్ గేటు వద్ద అండర్‌పాస్ నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. శనివారం రైల్వే డీఈ వెంకటేశ్వరావు, నిర్మాణం పనులను పరిశీలించారు. నిర్మాణం పనుల పట్ల డీఈ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట దెందులూరు కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ మటపర్తి రాంబాబు ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07-10
బెండకాయలు	24	కంద	56
పచ్చిమిర్చి	44-52	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-48	కీరా దోస	40
బీరకాయలు	26	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	36	అల్లం	220
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32	పాలకూర	08-12
దొండకాయలు	20	చుక్కకూర	08-12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	14	బఠాణీ	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	04
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	13

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	11
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.10	98503	10

కొల్లేరు వాసుల సేవలకు.. ఇక సెలవు

- బ్రిటీష్ కాలంనాటి వంతెన కూల్చివేత
- కొత్త వంతెన నిర్మాణానికి రూ.3.5 కోట్ల నిధులు మంజూరు



గుండుగొలనులో పాత వంతెన కూల్చివేత



బ్రిటిష్ కాలం నాటి వంతెన ఇదే

భీమడోలు: కొల్లేరు గ్రామాల ముఖ ద్వారమైన గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మించిన వంతెనను శనివారం కూల్చేసారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన నేడు శిథిలమవడంతో జేసీబీ సాయంతో రెండు రోజుల పాటు శ్రమించి కూల్చివేశారు. కొల్లేరు వాసులకు ఇప్పటి వరకు విస్తృత సేవలందించి వారి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఈ వారధి ఇక సెలవు తీసుకుంది. దీనితో కొత్త వంతెన నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది. సుమారు 120 ఏళ్ల క్రితం గోదావరి కాల్వపై బ్రిటిష్ వారు ఈ వంతెన నిర్మించారు. అప్పటి నుంచి భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, కైకలూరు ప్రాంతాల 20 గ్రామాలకు చెందిన 40 నుంచి 50 వేల మంది ప్రజల వారి జీవనయానంలో రవాణా మార్గం ఉండి వారి అభివృద్ధిలో తన వంతు సేవలందించింది. ఈ ప్రాంతాల ప్రజలతో మమేకమైన ఈ వంతెన స్థానికులకు మధుర జ్ఞాపకాలు మిగిల్చింది. ప్రధానంగా కొల్లేరులోని ఆక్వా రంగం అభివృద్ధికి ఈ వంతెన ప్రధాన భూమికగా ఉంది. ఈ వంతెన గత సెప్టెంబర్‌లో పాక్షికంగా కూలడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా బెయిలీ వంతెన నిర్మించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పాత వంతెన స్థానంలో కొత్త వారిధి నిర్మించేందుకు ఎమ్మెల్యే వాసుబాబు కృషి చేశారు. వంతెన ప్రాధాన్యతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఆయన తీసుకెళ్లారు. దీంతో రూ.3.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వారధి నిర్మాణానికి సాంకేతిక అనుమతులు పొందారు. దీనితో పాత వంతెనను పూర్తిగా కూల్చారు. ఆ వంతెన స్థానంలో రెండు లైన్లలో వాహనాలు రాకపోకలు సాగించేలా కొత్త వంతెన నిర్మాణం చేపడుతున్నారు.

నేడు కొత్త వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన

గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మించనున్న కొత్త వంతెన నిర్మాణ పనులకు ఈనెల 21న ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు శంకుస్థాపన చేస్తారని మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు శనివారం రాత్రి తెలిపారు. దీంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుందన్నారు. ఈ వంతెన నిర్మాణ పనులను జీఆర్ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో కాల్వలకు నీరు విడుదల చేసే సమయానికి వంతెన పనులు పూర్తి చేస్తారన్నారు.

పూళ్లలో సువార్త కూడికలకు ఏర్పాట్లు

భీమడోలు: పూళ్ల పడమర హరిజన పేటలోని ఆరోగ్య మాత క్రైస్తవాలయంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు శనివారం రాత్రి నిర్వాహకులు పేర్కొన్నారు. ఆరోగ్య మాత చర్చిలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు సువార్త కూడికలు నిర్వహిస్తామని సంఘం పెద్దలు, యూత్ సభ్యులు తెలిపారు. ఈనెల 23వ తేదీ మంగళవారం ఉదయం 12.30 గంటకు సుందరంగా నిర్మించిన దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. విశ్వాసులు, సంఘ సభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని దేవుని ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమాలకు రీజనల్ సుపీరియర్ జోభి, ఫాదర్లు షింటో, నెల్సన్, టోనీ, జోషి పాల్గొంటారన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ సీఈవో విజయకుమార్ హాజరవుతారని వారు తెలిపారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపీ శ్రీధర్ ఎంపిక

పెదపాడు: ఫుట్‌బాల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ఎంపికవడంపై పలువురు నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేసారు. ఇటీవల జరిగిన ఫుట్‌బాల్ అసోషియేషన్ ఎన్నికల్లో క్రీడల పట్ల ఆసక్తి, అభిరుచి కలిగిన శ్రీధర్‌ను ఎనుకోవడంపై నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు ముదుగురు సూర్యనారాయణ, జిల్లా బీసీ సంఘం యూత్ అధ్యక్షుడు బెజవాడ నర్సింహరావు తదితరులు ఎంపీ శ్రీధర్‌ను అభినందించారు.

వేంకటేశ్వర స్వామికి వెండి హారం అలంకరణ

భీమడోలు: గుండుగొలనులోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర ఆలయంలో శనివారం స్వామికి ఏలూరుకు చెందిన ఎన్ఆర్ఐ అర్జా మధుమూర్తి దంపతులు రూ.94,364 విలువైన 108 లక్ష్మీరూపుల వెండి హారాన్ని సమర్పించారు. శనివారం సంప్రోక్షణ పూజల అనంతరం స్వామి వారికి ఈ హారాన్ని అలంకరించారు. ఈవో డి.శంకరరావు, అభివృద్ధి కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు పాల్గొన్నారు.